తొలకరికి సానుకూలం

- అన్నదాతలకు శుభ సూచకం
- ముందస్తుగా నైరుతి రుతుపవనాలు
- విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం
- ద్రోణి ప్రభావంతో ఇప్పటికే చెదురు మదురుగా వానలు


దిగుమతి అవుతున్న ఎరువులు (ఫైల్)

రాయవరం: ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే వస్తున్నాయని, విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెప్పిన తీపి కబురు అన్నదాతల్లో ఆనందాన్ని నింపింది. జూన్ మొదటి వారంలో నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకి విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించడంతో ఖరీఫ్ సాగుకు వాతావరణం కూడా అనుకూలంగా ఉంటుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందించేందుకు వ్యవసాయ శాఖ ఇప్పటికే చర్యలు తీసుకుంటోంది. క్లస్టర్ పరిధిలోని రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని ఆరు మండలాల్లో 1.10 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసే అవకాశముంది.

తగ్గిన తీవ్రత

ఎల్‌నినో ప్రభావం తగ్గడంతో ఎండల తీవ్రత తగ్గింది. దీనికి తోడు అరేబియా మహా సముద్రంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇక క్లస్టర్ పరిధిలోని రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాలు ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో 1.10 లక్షల ఎకరాల్లో ఖరీఫ్‌లో వరిసాగు చేస్తారు. రబీ సీజన్లో వరి పంట ఆశాజనకంగా ఉండడం రైతులను సంతోషానికి గురి చేసింది. పురుగులు, తెగుళ్ల పంటను ఆశించక పోవడంతో తక్కువ పెట్టుబడులు పెట్టారు. దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో రబీలో రైతులు ఆనందంగా ఉన్నారు. అదే ఆనందంతో ఇప్పుడు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఇలాంటి తరుణంలో వాతావరణం కూడా కలిసి రావడం రైతులకు ఆనందాన్ని కలిగిస్తోంది. ఖరీఫ్ సాగుకోసం రైతులు భూములు సిద్ధం చేసుకుంటున్నారు. మరోవైపు రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.

రైతులు నష్ట పోకుండా

రైతులకు మేలైన విత్తనాలు అందించాలనే లక్ష్యంతో వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. నాణ్యమైన ఎరువులు ఉంటేనే పంటలు ఏపుగా పెరిగి పచ్చదనంతో కళకళలాడతాయి. పంటలపై పిచికారీ చేసే పురుగు మందు కూడా నాణ్యంగా ఉంటే చీడపీడలు సకాలంలో అదుపు చేసుకోవచ్చు. ఇందులో ఏది లేకపోయినా దాని పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. అలాగే నకిలీలు, కల్తీలకు తావు లేకుండా ప్రభుత్వం నియోజకవర్గ వారీగా వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేసింది. రైతులు తాము కొనుగోలు చేసిన విత్తనాలు ఎరువుల నాణ్యతా ప్రమాణాలను ముందు జాగ్రత్తగా ల్యాబ్స్‌లో చెక్ చేసుకునే వీలుంది. ఈ పరీక్షలు ఉచితంగానే చేస్తారని, సబ్సిడీపై రైతన్నలకు అవసరమైన విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేస్తోంది.

మంచి దిగుబడులు వచ్చాయి



"త్వరలోనే ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న కారణంగా, ఖరీఫ్‌కు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. రబీలో రైతులకు ఆశాజనకంగా మంచి దిగుబడులు వచ్చాయి. ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయి. మరో పది రోజుల్లో వ్యవసాయ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ముందుగానే రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను సిద్ధం చేసే పనిలో ఉన్నాం. సాగు విస్తీర్ణం ఆధారంగా అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాం."

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

క్లుప్తంగా

పంట పొలంలోకి దూసుకెళ్లిన ఆటో


పంట పొలంలోకి దూసుకుపోయిన ఆటో

కాజులూరు: గొల్లపాలెం–యానం రహదారిలో శనివారం ఒక ఆటో అదుపుతప్పి పంటపొలాల్లోకి దూసుకుపోయింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. కాకినాడకు చెందిన ఆటో ప్రయాణికులతో కాజులూరు వెళుతుంది. మండలంలోని గొల్లపాలెం–చేదువాడ గ్రామాల మధ్య రోడ్డు పునర్నిర్మాణం పనులు జరుగుతుండటంతో రోడ్డు మలుపులో ఆటో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపుతప్పి పక్కనే ఉన్న పంట పొలాల్లోకి దూసుకుపోయింది. ఆటోలో ముగ్గురు ప్రయాణికులు ఉన్నారు. అదృష్టవశాత్తూ పొలం పూర్తిగా ఎండిపోయి ఉండటంతో ఆటో బోల్తా పడకుండా పొలంలో కొంతదూరం కుదుపులతో ముందుకు వెళ్లి ఆగింది. దీంతో ప్రయాణికులకు త్రుటిలో ప్రమాదం తప్పింది.

పారిశుధ్య నిర్వహణపై సూచనలు ఇవ్వండి

కాజులూరు: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ఆరోగ్యశాఖ సిబ్బంది పంచాయతీ అధికారులకు తగిన సూచనలు చేసి ప్రజల ఆరోగ్య పరిస్థితులను చక్కదిద్దాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య అన్నారు. శనివారం స్థానిక పీహెచ్‌సీలో జరిగిన హెల్త్ సిబ్బంది, ఏఎన్ఎంల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చెదురు మదురు వర్షాల కారణంగా గ్రామాల్లో అపరిశుభ్రత తలెత్తి వాతావరణం కలుషితమౌతుందన్నారు. ఫలితంగా అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ విషయంపై సిబ్బంది అప్రమత్తంగా ఉండి గ్రామాల్లో ప్రజలను చైతన్య పరచటంతో పాటు ఎప్పటికప్పుడు వీధులు శుభ్రం చేసి డ్రైనేజీలు మెరుగుపరచేలా పంచాయతీ సిబ్బందికి సూచించాలన్నారు.

కల్వర్టుల నిర్మాణాలు వెంటనే చేపట్టాలి


జయరాజు

మండపేట: ద్వారపూడి– మండపేట మార్గంలో అసంపూర్ణంగా ఉన్న కల్వర్టుల నిర్మాణాలను వెంటనే చేపట్టి పూర్తి చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దూలి జయరాజు మాదిగ విజ్ఞప్తి చేశారు. ఆయన మండపేటలో శనివారం విలేకరులతో మాట్లాడారు. మండపేట నుంచి ద్వారపూడి మధ్యలో పెండింగులో కల్వర్టులను నిర్మించి సీసీ రోడ్డును సంపూర్ణం చేయాలన్నారు. రబీ పంట పూర్తయినందున పంట కాలువలకు నీటి విడుదలను నిలిపివేసినందున కల్వర్టుల నిర్మాణాలు ప్రారంభించాలని కోరారు. తొలకరి పంటకు సాగునీరు విడుదల చేసే లోగా ఈ పనులన్నీ పూర్తి చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆయన అధికారులను కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రామచంద్రపురం రూరల్: మండలంలోని భీమక్రోసుపాలెం గ్రామానికి చెందిన యువకుడు పిల్లి సాయిచరణ్ (23) కాకినాడ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ద్రాక్షారామ ఏఎస్సై డీవీ వెంకట రమణారావు విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మృతుడు సాయిచరణ్ ఇంటర్ వరకు చదువుకున్నాడు. సొంత గ్రామంలోనే బెండ తోట వేసి వ్యవసాయం చేస్తున్నాడు. అయితే నష్టాలు రావడంతో ఈ నెల 11న పంటలకు ఉపయోగించే కలుపు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాకినాడ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. తండ్రి వెంకట సుబ్బారావు ఫిర్యాదు, ఆసుపత్రి సమాచారాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రమణారావు తెలిపారు.

కన్యకా పరమేశ్వరి అమ్మవారికి జన్మనక్షత్ర పూజలు


ద్రాక్షారామలో కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఊరేగింపులో కానుకలు సమర్పిస్తున్న భక్తులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో వేంచేసియున్న కన్యకా పరమేశ్వరి అమ్మవారికి వైశాఖ శుద్ధ దశమి పురస్కరించుకుని శనివారం జన్మ నక్షత్ర పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు వారణాసి కార్తికేయ శర్మ బ్రహ్మత్వంలో కొమ్మిశెట్టి గోపాల్, రమాశైలజ దంపతుల చేతుల మీదుగా గణపతి పూజ, అభిషేకాలు, పుణ్యాహావాచనం, చండీ పారాయణ, చండీ హోమం, శ్రీచక్రార్చన, నీరాజన మంత్ర పుష్పాలు, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి మహిళామండలి ఆధ్వర్యంలో లలితా సహస్ర పారాయణ చేశారు. అనంతరం పలు రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలంకరణలతో అలంకరించిన ప్రత్యేక వాహనంపై అమ్మవారి ఊరేగింపు బ్యాండు మేళాలు, కేరళ నృత్యాలతో ఘనంగా నిర్వహించారు. రాత్రి అన్న ప్రసాద వితరణ చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొమ్మిశెట్టి గోపాల్, ఉపాధ్యక్షుడు పసుమర్తి సూర్యశేఖర్, ప్రధాన కార్యదర్శి అప్పన రాజశేఖర్ (అయ్యప్ప), కోశాధికారి వెచ్చా కిషోర్, కార్యదర్శులు పసుమర్తి అరుణ్‌కుమార్, త్రిపురమల్లు గోపాల్, సంఘ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా జయంతి వేడుకలు

రాయవరం: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాన్ని రాయవరంలో శనివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి గ్రామోత్సవం జరిగింది. తొలుత వాసవీ మాత చిత్ర పటాన్ని పల్లకీలో ఉంచి, మేళ తాళాలతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం గ్రామానికి చెందిన మహిళలు వాసవీ మాత చిత్ర పటాన్ని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ పసుపు కుంకాలు, చిన్నారులను చల్లగా చూడాలంటూ వాసవీ మాతను వేడుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొడ్డు గోవర్ధన కృష్ణుడు, ప్రధాన కార్యదర్శి దిగవల్లి వీరవెంకట చంద్రశేఖర్, కోశాధికారి బొడ్డు వెంకటరావు, ఆర్యవైశ్య సంఘం నేతలు గ్రంధి వీరభద్రరావు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అంగరలో

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లో శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి జయంతి సందర్భంగా ఊరేగింపు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించినట్టు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు దాసరి ప్రభాకర సుబ్బారాయుడు తెలిపారు. అనంతరం ఆర్య వైశ్య సంఘం సత్రంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఇరు గ్రామాల భక్తులు అధిక పాల్గొన్నారు.

మండపేట, ద్వారపూడిలలో..

మండపేట: వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను శనివారం మండలంలోని ద్వారపూడి, మండపేట పట్టణాల్లో ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. రెండు చోట్ల ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా మండపేట నాయుళ్ల గుడి వీధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయానికి స్థానిక ఆర్యవైశ్యులు, మహిళలు, పెద్దలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. పల్లకీలో అమ్మవారిని ఉంచి పుర వీధుల్లో ఊరేగించారు. వల్లూరి వారి వీధి, కలువపువ్వు సెంటర్ మీదుగా పొట్టి శ్రీరాములు, కేపీ రోడ్డు మీదుగా కొండపల్లి వారి వీధి, గొల్లపుంత వీధుల గుండా అమ్మవారి ఊరేగింపు సాగింది. అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. వందలాది ఆర్య వైశ్య మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సంకా బాబ్జీ, కాళ్లకూరి నాగబాబు, కొనగళ్ల సత్తిపండు, బోనగిరి రాజా, కార్యదర్శి సంకా కుమార్‌బాబు, కోశాధికారి మన్యం ప్రసాద్, గ్రంధి నమశ్శివాయ బ్రదర్స్, చెన్నా గాంధీ, చెన్నా రాంబాబు, చెక్కా రాంబాబు, గ్రంధి బులిబాబు, కందుల కిరణ్, కుంచం రమేష్, బోనగిరి బాబ్జి, బోడా వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.


కపిలేశ్వరపురం మండలం అంగరలో కన్యకా పరమేశ్వరి ఊరేగింపులో నిర్వాహకులు


రాయవరంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి గ్రామోత్సవం


మండపేటలో భక్తులచే పూజలు అందుకున్న వాసవీ మాత

గుండెల్లో గుబులు

- కలవరపెడుతున్న వాతావరణం
- అకాల వర్షాలతో రైతుల ఉరుకులు, పరుగులు


కె.గంగవరంలో ధాన్యం తడవకుండా బరకాలు కప్పుతున్న రైతులు

కె.గంగవరం: ఏటా ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు నష్టపోతున్నారు. ఈ ఏడాది పంట ఆశాజనంగా ఉన్న తరుణంలో ఇప్పుడు ప్రకృతి కన్నెర్ర చేస్తుందోమోనని రైతులు కలవరపడుతున్నారు. ధాన్యాగారమైన రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలో 6308 హెక్టార్లు, రామచంద్రపురం మండలంలో 6000 హెక్టార్లు, కాజులూరు మండలంలో 7200 హెక్టార్లలో ఈ ఏడాది రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుతం వరి పంట నియోజవకర్గంలోని మూడు మండలాల్లో కోత దశలో ఉంది. సుమారుగా 30 శాతం పంట కోత కూడా కోసి ధాన్యాన్ని రోడ్లమీద, పొలం గట్లపై రైతులు ఆరబెట్టుకున్నారు. మరికొంత మంది రైతులు పనలను కోసి చేలోనే వదిలేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ద్రోణి ప్రభావంతో గత రెండు రోజులుగా వర్షాలు కురవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. అందినకాడల్లా అప్పులు చేసి ప్రస్తుతం తొలకరి పంటను సాగు చేశామని పంట చేతికందే సమయంలో వర్షాలు పడితే అప్పుల పాలైపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ద్రోణి ప్రభావం వల్ల మరో రెండు మూడు రోజులు వర్షాలు పడతాయని వాతావరణశాఖ వెల్లడించడంతో పాటు ఉదయం నుంచి వాతావరణం మబ్బులతో ఈదురుగాలులు, చినుకులు పడడంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు. శనివారం ఉదయం నుంచి వాతావరణం బాగుండడంతో రైతులు కోసి ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టారు. మధ్యాహ్నం అకస్మాత్తుగా వాతావరణం మారి వర్షం కురవడంతో ముందస్తు చర్యల్లో భాగంగా పంటను వర్షాల నుంచి కాపాడుకోవడానికి ప్రస్తుతం రైతులు నానా పాట్లు పడ్డారు.

కోకో గింజలకు కనీస మద్దతు ధర ప్రకటించాలి

అంబాజీపేట: కోనసీమ వ్యాప్తంగా కొబ్బరి తోటల్లో అంతర పంటగా సాగుచేస్తున్న కోకో గింజలకు ఇతర పంటలకు ప్రభుత్వం ప్రకటిస్తున్న కనీస మద్దతు ధరను ప్రకటించాలని కోనసీమ కోకో రైతుల అసోసియేషన్ కోరింది. అంబాజీపేట సొసైటీ కార్యాలయం పై అంతస్తులో ఉన్న కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ కార్యాలయంలో కోనసీమలోని కోకో సాగు చేస్తున్న రైతుల సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో పలువురు రైతులు మాట్లాడుతూ కోకో సాగులో మెళకువలు, కాయ కోత, గింజల నాణ్యతగా తయారీ విధానాలు, మార్కెటింగ్ తదితర అంశాలపై అభిప్రాయాలను తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ సమస్యల వల్ల కోకో గింజల దిగుబడి గణనీయంగా తగ్గిపోవడం వల్ల కోకో గింజల ధర ఇటీవల కాలంలో కిలో రూ.1000 వరకు పెరిగిందని అయితే ఈ ధర రూ.500కు తగ్గిపోవడం బాధాకరమన్నారు. పెరిగిన ధరలతో కోకో పంటను కాపాడుకోవాలనే ఆలోచనకు దారితీసిందని అందువల్ల పెరిగిన ధరలను కాపాడుకునేలా రైతులందరూ ఐకమత్యంగా కృషి చేయాలని సమావేశంలో రైతులు పేర్కొన్నారు. కోనసీమ కోకో రైతుల అసోసియేషన్ తరఫున కోకో గింజలకు కనీస ధర ఉండేలా తీర్మానం చేశారు. సమావేశంలో రైతులు ముత్యాల జమ్మీలు, సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, సమయమంతులు పండు, ఉప్పుగంటి భాస్కరరావు, చేకూరి సూర్యనారాయణ రాజు, ప్రసాద్ రాజు, అడ్డాల గోపాలకృష్ణ, రెడ్డి రామకృష్ణ, కొప్పిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణలో చిన్నారుల ప్రతిభ

మలికిపురం: లక్కవరంలోని ఓ పాఠశాలలో నిర్వహించిన ఉచిత సమ్మర్ శిక్షణలో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మే 1వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ ఈ శిక్షణ నిర్వహించారు. డ్రాయింగ్, కంప్యూటర్ విద్య, స్పోకెన్ ఇంగ్లీష్, వేదిక్ మ్యాథ్స్, క్లాసిక్ డ్యాన్స్ ఇలా పలు అంశాలలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. డ్రాయింగ్‌లో జి.సుష్మ, స్పోకెన్ ఇంగ్లీష్‌లో కె.జాన్విక్టర్, కంప్యూటర్‌లో ఎ.అవినాష్ విజేతలుగా నిలిచారు. బహుమతుల పంపిణీలో గోడి బాలాజీ, ఉపాధ్యాయులు నారాయణ, రామకృష్ణ, ప్రతాప్, సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలు ఆకస్మిక తనిఖీ


కొత్తపేట సబ్‌జైలులో ఖైదీల సౌకర్యాలపై ఆరా తీస్తున్న సీనియర్ సివిల్ జడ్జి రమణారెడ్డి

కొత్తపేట: స్థానిక సబ్‌జైలును సీనియర్ సివిల్ జడ్జి పి.రమణారెడ్డి శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌జైలులో రిమాండ్ ఖైదీల సౌకర్యాలు, వసతి, భోజన సౌకర్యాలు గురించి సబ్ జైలు అధికారులు, సిబ్బందిని ఆరా తీసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైదీలతో ముఖాముఖి మాట్లాడారు. వారిపై మోపబడిన నేరాలు, కేసులు, రిమాండ్ కాలం తదితర అంశాల గురించి ఆరా తీశా రు. అవసరమైతే ఉచిత న్యాయ సహాయం సౌకర్యం కల్పిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్షణికావేశంలో చేసిన తప్పులకు ఈ పరిస్థితి ఏర్పడి ఉండవచ్చని, ఇకపై సత్ప్రవర్తనతో మెలిగి భవిష్యత్‌లో మంచి జీవితాన్ని గడపాలని సూచించారు.

భక్తులతో పోటెత్తిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిదర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేద పండితుల స్వామికి తులసీ పూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారికి పటిక బెల్లం మొక్కుగా చెల్లించారు.

కన్నుల పండువగా వెంకన్న కల్యాణం

అంబాజీపేట: శ్రీనివాసా గోవిందా... శ్రీ వేంకటేశా గోవిందాలతో నామస్మరణాల మధ్య వెంకన్న కల్యాణం కన్నుల పండువగా జరిగింది. కొర్లపాటివారిపాలెంలో వేంచేసియున్న శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణం శనివారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగపల్లి నరసింహాచార్యులు బ్రహ్మత్వంలో స్వామి వారి కల్యాణం, వేద మంత్రోచ్చారణ నడుమ, మంగళ వాయిద్యాలతో, గోవింద నామస్మరణతో వెంకన్న కల్యాణం కన్నుల వైకుంఠంగా సాగింది. వందలాది మంది మహిళలు స్వామి కళ్యాణాన్ని భక్తి శ్రద్ధలతో తిలకించారు. అంతకుముందు స్వామివారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రాంగణం వద్ద ఆదివారం స్వామి వారి తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు వీరేశ్వరస్వామికి..

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో వేంచేసియున్న ఉమాపార్వతి సమేత వీరేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి వార్ల కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు దేవాలయ అర్చకులు చంద్రమౌళి వెంకట నరసింహశర్మ, సుదర్శనం కేశవాచార్యులు, భక్త బృందం తెలిపారు. స్వామి వార్ల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా త్రిశూల చక్రస్నానం, నాగవల్లి, వైశాఖ పూజలు చేయనున్నామన్నారు. అదే రోజున ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన చేపట్టనున్నామన్నారు.

నేడు రంగనాయక స్వామి కల్యాణోత్సవం

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెంలో కొలువైన శ్రీ, భూ సమేత రంగనాయక స్వామికి ఆదివారం కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ శనివారం ఓ ప్రకటనలో ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామివారికి వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ స్వామికి విశేష పూజలు నిర్వహిస్తారని తెలిపారు. మధ్యాహ్నం స్వామిని ప్రత్యేక రథంపై గ్రామోత్సవం నిర్వహిస్తారన్నారు. సాయంత్రం తొమ్మిది గంటలకు స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు.

ఘనంగా శత జన్మదిన వేడుకలు

సఖినేటిపల్లి: వందేళ్లు పూర్తి చేసుకున్న తండ్రికి పుట్టినరోజు వేడుకలను కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. సఖినేటిపల్లి సంజీవయ్య కాలనీకి చెందిన దొండపాటి రత్నం 100 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా శత జయంతి వేడుకలను గ్రామస్తులు కుటుంబ సభ్యులు బంధుమిత్రుల మధ్య శనివారం ఘనంగా నిర్వహించి విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లూథరన్ హైస్కూల్ కరస్పాండెంట్ నల్లి ప్రేమానందం, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, గొల్లమందల విజయరత్నం, రమేష్ బాబు, కుసుమ రాకేష్, కుటుంబ సభ్యులు సువర్ణ రత్నం, మేరీ సుజాత, రత్నకుమారి, నిర్మల పాల్గొన్నారు.

ఆకుకూరల సాగు.. రైతులకు బాగు


తోటకూర


పాల కూర

- సస్యరక్షణ చర్యలు
- ఆరోగ్యానికి మేలు

కె.గంగవరం: విటమిన్లు, లవణాలు, మాంసకృత్తులు, పీచుపదార్థాలు మెండుగా ఉండే ఆకుకూరలకు ఈ మధ్య డిమాండ్ బాగా పెరిగింది. దీనికి తోడు స్వల్ప వ్యవధిలో పంట చేతికందుతుంది. ఆకుకూరలను తినడం ద్వారా ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. దీంతో పాటు ఆకుకూరల సేద్యం ద్వారా ఆదాయం కూడా పెరుగుతుంది. ఆకుకూరల సాగు మెలుకువలపై కె.గంగవరం ఏఓ ఎస్.బలుసు రవి అందిస్తున్న సూచనలు.

నేల తయారీ.. ఎరువులు

ముఖ్యంగా ఆకుకూరల సాగుకు నేల తయారీ చాలా ముఖ్యం. మెత్తడి దుక్కు వచ్చే వరకు లోతు దుక్కితో పాటు 3,4 సార్లు సాధారణ దుక్కి చేయాలి. దుక్కిన తరువాత నేలలో మట్టి పెళ్లలు లేకుండా చదును చేసుకోవాలి. నేలను సమాంతరంగా సిద్ధం చేయాలి. ఆఖరి దుక్కిలో ఎకరానికి 10 టన్నుల పశువుల పెంట, 300 కిలోల వేపపిండి, 100 కిలోల సూపర్ పాస్ఫేట్, 10 కిలోల జింకు సల్ఫేట్, రెండు కిలోల గ్రాన్యుబోర్, 100 కిలోల శుద్ధిచేసిన ట్రైకోటెర్మా, 20కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ వేసుకుని ఆకుకూరలను విత్తుకోవాలి.

తోట కూర..

ఈ విత్తనాల చాలా చిన్నవిగా ఉంటాయి. వీటిని ఇసుకతో కలిపి తయారు చేసుకున్న నేలలో విత్తుకోవాలి. ఎకరానికి 800 గ్రాములు సరిపోతాయి. 10 కిలోల ఇసుకను కలిపి మడులపై పలచగా చుల్లుకొని పలుచని పొరలా మెత్తటి మట్టి లేదా ఇసుకతో కప్పాలి.

కొత్తిమీర...

కొత్తిమీర విత్తుకునేటప్పుడు విత్తనాన్ని రెండు బద్దలుగా చేయాలి. లేకపోతే గింజ ఆలస్యంగా మొలకెత్తి మొలకశాతం దెబ్బతింటుంది. దీనికి కోసం గింజలను నేలపై పోసి సున్నితంగా నేలకేసి రుద్దాలి.

మెంతికూర..

ఇది పప్పు జాతి పంట. మొదటిసారి పొలంలో విత్తే ముందు రైజోబియం కల్చర్‌ను విత్తనాలకు పట్టిస్తే వాతారణంలోని నత్రజనిని గ్రహించినడానికి తోడ్పడుతుంది. దీని ద్వారా మెంతికూర మొక్కల పెరుగుదల బాగుంటుంది.

పాలకూర..

విత్తనాలను 3.4 సెం.మీ లోతులో విత్తుకోవాలి. లోతు ఎక్కువ అయితే మొలక సారిగా రాదు. ఎకరానికి నాలుగు లేదా ఐదు కిలోల విత్తనాలు సరిపోతాయి. పాల కూర కూడ పంట త్వరగా చేతిందుతుంది.

కరివేపాకు..

విత్తనాలను పండు నుంచి వేరు చేసిన వెంటనే నేలలో విత్తుకోవాలి. ఆరిన తరువాత విత్తితే మొలక శాతం బాగా తగ్గిపోతుంది. విత్తన 48 గంటల్లోపు నేలలో పదును చూసుకుని లీటరు నీటికి నాలుగు లీటర్ల పిండి మిథాలిన్ కలిపి పిచికారీ చేసుకోవాలి. పంట తొలి దశలో కలుపును నివారించుకోవచ్చు. ఇలాంటి సస్యరక్షణ చర్యలు చేపడితే ఆకుకూరల్లో చీడపీడలు నివారించుకుని మంచి దిగుబడులు సాధించుకోవచ్చు.